www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -104 బుధవారం 29 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## లీకేజీలకు కారకులను
# కఠినంగా శిక్షించాలి

**అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య**

**గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి**

**కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు**

**ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**



**న్యూఢిల్లీ,జూలై 28 (ప్రజావినికిడి):**

ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగామిగతా 2లో...

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట



**యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్**

**లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా**

**గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు**

**లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**



**న్యూఢిల్లీ,జూలై 28 (ప్రజావినికిడి):**

భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగామిగతా 2లో...

## జనసంద్రమైన సింహాచలం.

**ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం**

**అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం**

**10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా**

**భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ**

**స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ**

**సింహాచలంజూలై 28 (ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో మిగతా 2లో...



## విజయవాడ, గుంటూరుతో
# కలిపి చూడాలి

**రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన**

**పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం**

**ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**

**ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి**




**అమరావతి జూలై 28 (ప్రజావినికిడి):**

రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు మిగతా 2లో...

## రేపిస్ట్‌లను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

**ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ**



2లో.

## హైడ్రా కార్యక్రమాలను
# కొనసాగిస్తాం

**ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది**

**కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం -హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు -ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీజూలై 28 (ప్రజావినికిడి):**

హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు.మిగతా 2లో...

## డీఎస్సీ అవకతవకలకు
# ఆస్కారమే లేదు..




**అత్యాధునిక భద్రతపై ఏపీ ప్రభుత్వం వివరణ**

**ఏపీ మెగా డీస్సీ-2025పై ఆరోపణలు**

**వివరణ ఇచ్చిన కూటమి ప్రభుత్వం**

**మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు గాను 15,941 మందికి నియామక పత్రాలు జారీ**

**టీసీఎస్ ప్లాట్‌ఫామ్‌పై పటిష్ఠ భద్రతతో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ**

**ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం, పారదర్శకతకు పెద్దపీట**

2లో.

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

### : రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

**హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు**

**హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్**

**హైడ్రా పేరుతో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ**

**కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న**



**జూలై 28 (ప్రజావినికిడి):**

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు.మిగతా 2లో...

## తెలుగు తేజం సిల్వర్ షో

**వెయిట్‌లిఫ్టింగ్‌లో అజయ బాబుకు రజతం**

**గ్లాస్గో 2026 కామన్‌వెల్త్ క్రీడలు**

**గ్లాస్గో (స్కాట్లాండ్)జూలై 28 (ప్రజావినికిడి):**

గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో తెలుగు వెలుగు. తెలుగు తేజం, విజయనగరం జిల్లాకు చెందిన వల్లూరి అజయ బాబు వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో వల్లూరి అజయ బాబు పతక ప్రదర్శన కనబరిచాడు. స్నాచ్‌లో 149 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీలు ఎత్తిన అజయ బాబు.. ఓవరాల్‌గా 330 కేజీలు 2లో...



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

**మొదటిపేజీ తరువాయి**



ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపైమాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నా పత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనులవిషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరి శీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కుఅవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**మొదటిపేజీ తరువాయి**

పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఏ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు..

**అమరావతి జూలై 28 (ప్రజావినికిడి):**

మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక పరీక్షల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను ఏపీలోని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీ చర్యలతో పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేసింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**లీక్‌కు ఆస్కారం లేని భద్రతా వ్యవస్థ**

పరీక్షల నిర్వహణలో అనుసరించిన పటిష్ఠమైన భద్రతా విధానాలను ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన టీసీఎస్ అయాన్ (ౠజూ ఙూచీ) ప్లాట్‌ఫామ్‌ను ఈ పరీక్షల కోసం వినియోగించినట్టు తెలిపింది. సమాచార భద్రతకు అత్యున్నత ప్రామాణికమైన 256-బిట్ ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీతో ప్రశ్నపత్రాలను భద్రపరిచామని, దీనివల్ల డేటా లీక్ అయ్యే అవకాశమే లేదని స్పష్టం చేసింది. పరీక్ష రాసే ప్రతి అభ్యర్థికి 42 లక్షల ప్రశ్నల భారీ బ్యాంక్ నుంచి కంప్యూటర్ ద్వారా యాదృచ్ఛికంగా (=ఖఅసశీఎ రాష్ట్రబటటశ్రీఱఅస్త్ర) ప్రశ్నలు వస్తాయని, ఒక అభ్యర్థికి వచ్చిన ప్రశ్నపత్రం మరొకరికి రాదని వివరించింది. దీనివల్ల మాస్ కాపీయింగ్‌కు గానీ, ముందుగా ప్రశ్నలు తెలుసుకునేందుకు గానీ ఆస్కారం ఉండదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ప్రతి పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ నిఘా వంటి బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహించామని పేర్కొంది. దరఖాస్తు స్వీకరణ నుంచి హాల్ టికెట్ల జారీ, ఆన్‌లైన్ పరీక్ష, ఫలితాల వెల్లడి, తుది ఎంపిక వరకు ప్రతి దశలోనూ పారదర్శకతకు పెద్దపీట వేశామని ప్రభుత్వం వివరించింది.

**గత ప్రభుత్వ విధానాలపై విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ నియామకాలపై అనుసరించిన వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం తప్పుబట్టింది. గత పాలకులు 'మెగా డీఎస్సీ' అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, చివరికి 'టెట్ కమ్ టీఆర్టీ' పేరుతో నియామకాలు చేపట్టి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశారని ఆరోపించింది. 2024 ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని విమర్శించింది. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్యను 16,347కు పెంచి, నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందని గుర్తుచేసింది. గతంలో జరిగినట్లుగా అసంబద్ధ విధానాలకు, అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకునే చర్యలకు తమ పాలనలో తావులేదని స్పష్టం చేసింది.

**అభ్యర్థులకు అండగా ఉంటాం**

ఏళ్ల తరబడి కష్టపడి చదివి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థుల శ్రమ వృథా కాదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రతిభ, నిబద్ధత, కఠోర శ్రమను నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని పేర్కొంది. కొందరు కావాలనే అవాస్తవ ప్రచారాలతో అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది.

ఈ నియామక ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగదని, కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి రాజీకి తావులేదని, ఈ విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన పనిలేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

# జనసంద్రమైన సింహాచలం.

**మొదటిపేజీ తరువాయి**

32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది.

కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి

**మొదటిపేజీ తరువాయి**

నగరాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను రాజధానికి అనుసంధానంగా అభివృద్ధి చేసినప్పుడే సమగ్ర రాజధాని రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై సీఆర్డీఏ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ పనులను 'స్పీడ్, క్వాలిటీ, డెలివరీ' లక్ష్యంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత పెరిగినప్పటికీ, అది ఏమాత్రం సరిపోదని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, కాబట్టి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణం వంటి గొప్ప అవకాశం దక్కినందుకు కాంట్రాక్టు సంస్థలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో రూ.50,999 కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, నెలకు కనీసం 7.92 శాతం చొప్పున పనులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల వంటి కీలకమైన అంశాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, ఉన్నతాధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

రాజధాని నిర్మాణ పనుల పురోగతిని ఇకపై తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేపిస్ట్‌లను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

## ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూలై28:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రహ్లాద్ జోషి అత్యంత నీచమైన ప్రవర్తన కలిగిన వ్యక్తి అంటూ రాహుల్ మండిపడ్డారు. రేపిస్ట్‌లను ఆయన రక్షిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ బయట రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. 'యువత విద్యావ్యవస్థపై నిరసనలు తెలుపుతోంది. చాలా మంది అమ్మాయిలు ఆందోళనలు చేస్తున్నారు. పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా.. రేపిస్ట్‌లను సమర్థించే ఓ వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిని చేసింది. ఆయన అత్యంత నీచమైన వ్యక్తి. రేపిస్ట్‌లకు రక్షణ కావాలని చెప్పే వ్యక్తి కంటే మించిన నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అలాంటి వ్యక్తి భారతదేశ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు. బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషుల శిక్షా కాలాన్ని తగ్గించి, విడుదల చేయడాన్ని గతంలో ప్రహ్లాద్ జోషి సమర్థిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాహుల్ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# తెలుగు తేజం సిల్వర్ షో

**మొదటిపేజీ తరువాయి**

ఎత్తిపడేశాడు. 331 కేజీలతో మలేషియా వెయిట్‌లిఫ్టర్ మహ్మద్ హిదయత్ పసిడి పతకం సాధించాడు. స్నాచ్‌లో 149 కేజీలతో అజయ బాబు ముందంజలో నిలువగా.. 147 కేజీలతో హిదయత్ తర్వాతి స్థానంలో ఉన్నాడు. కానీ క్లీన్ అండ్ జెర్క్‌లో హిదయత్ 184 కేజీలు అవలీలగా ఎత్తాడు. దీంతో స్నాచ్‌లో లోటును అధిగమించి అజయ బాబును వెనక్కి నెట్టాడు. ఇంగ్లాండ్ వెయిట్‌లిఫ్టర్ క్రిస్ ముర్రే 325 కేజీలతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఇక పురుషుల హై జంప్‌లో సర్వేశ్ అనిల్ కుశారె సైతం రజత పతకం సాధించాడు. ఫైనల్లో 2.25 మీటర్ల జంప్‌తో సర్వేశ్ రెండో స్థానంలో నిలిచాడు. జమైకా అథ్లెట్ 2.25 మీటర్లతో పసిడి పతకం సాధించాడు. సర్వేశ్, జమైకా అథ్లెట్ సమవుజ్జీలుగా నిలిచినా.. తక్కువ ఫెయిల్యూర్స్ (కౌంట్‌బ్యాక్ రూల్) ప్రాతిపదికన జమైకా అథ్లెట్‌కు పసిడి పతకం అందించారు.

**షర్మిళకు స్వర్ణం**

గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో పారా అథ్లెట్ షర్మిళ చరిత్ర సృష్టించింది. సీజన్ బెస్ట్ ప్రదర్శనతో షర్మిళ పసిడి పతకం నెగ్గింది. మహిళల షాట్‌పుట్ (ఎఫ్57) ఫైనల్లో షర్మిళ అగ్రస్థానంలో నిలిచింది. 9.81 మీటర్ల దూరంతో పసిడి పతకం సొంతం చేసుకుంది. బంగారు పతకం సాధించిన షర్మిళ.. కామన్‌వెల్త్ క్రీడల్లో పారా పసిడి నెగ్గిన తొలి ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడిన శిల్పా కంచుగారకొప్పలు శ్యాల కాంస్య పతకం దక్కించుకుంది. 7.26 మీటర్ల దూరంతో ఉత్తమ వ్యక్తిగత ప్రదర్శన చేసిన శిల్పా మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించింది. ఓ పారా అథ్లెటిక్స్ ఈవెంట్‌లో భారత పారా అథ్లెట్లు రెండు పతకాలు సాధించటం ఇదే ప్రథమం.

**2010లో తండ్రి..2026లో తనయుడు**

2004లో జన్మించిన అజయ బాబుది క్రీడా నేపథ్యం కలిగిన కుటుంబం. అజయ్ బాబు తండ్రి వల్లూరి శ్రీనివాస రావు సైతం వెయిట్‌లిఫ్టర్. అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. 2003 ఆఫ్రో ఏసియన్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్‌తో మొదలైన శ్రీనివాస రావు పతక ప్రస్థానం.. కామన్‌వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం అందుకునే వరకు సాగింది. 2010 ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలకు ఓ నెల రోజుల ముంగిట శ్రీనివాస రావుకు గాయమైనా.. మెన్స్ 56 కేజీల విభాగంలో పోటీపడి కాంస్య పతకం సాధించాడు. అంతకుముందు, 2009లో కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇదే విభాగంలో పసిడి పతకం దక్కించుకున్నాడు. 2011 నేషనల్ గేమ్స్‌లో చాంపియన్‌గా నిలిచిన శ్రీనివాస రావు.. 2010 ఆసియా క్రీడల్లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. శ్రీనివాస రావు ఇద్దరు కుమారులు వెయిట్‌లిఫ్టర్లు కాగా.. అజయ బాబు గ్లాస్గోలో తండ్రిని మించిన ప్రదర్శన కనబరిచాడు.

# ఊర చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా మార్చిన "సంజీవని వెంచర్" నిర్వాహకులు

**ఊర చెరువును పరిశీలించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు..**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని రాయికల్ గ్రామ శివారులో సర్వేనెంబర్ 247,248,249,250,251,252&257 రాయికల్ శివారులో(7.2) ఏడు ఎకరాల రెండు గుంటల భూమి పట్టాదారు మహమ్మద్ అజార్ అలీ,సన్నాఫ్ జుఫెకర్ అలీ,అప్లికేషన్ నెంబర్ 29/3/2022, ఈ అప్లికేషన్ ఎన్వోసీ పర్పస్ లో పెడితే జాయింట్ ఇన్స్పెక్షన్ కి వచ్చినా డిప్యూటీ ఇఇ కరుణశ్రీ,నాటి తహసిల్దార్ గోపాల్,అసిస్టెంట్ ఇంజనీర్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకళ,సర్వేయర్ బీమ్లా నాయక్,వీరందరూ కలిసి26/8/2022 తర్వాత 13/12/2022 రెండు పర్యాయాల ఇన్స్పెక్షన్ చేసి భూయజమాని మహమ్మద్ అజార్ అలీ కి ఎన్‌ఓసి జారీ చేయడం జరిగింది.గ్రామానికి ఊర చెరువు విస్తీర్ణం సర్వేనెంబర్(258)లో (4:10)నాలుగు ఎకరాల 10 గుంటల శిఖం భూమికి అనుకోని ఉన్న బఫర్ జోన్ కు ఎన్‌ఓసి ని అడ్డుపెట్టుకొని చెరువు పరివాహకమంతా మట్టి నింపి చెరువులోకి నీరు వెళ్లే పరిస్థితి లేకుండా చేశారు,చెరువు పైభాగం లో (2)ఫీడర్ ఛానల్ ఉన్నాయని జిఎంఆర్ జడ్చర్ల ఎక్ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ వాళ్ళు చూయించడం జరిగింది. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వర్ధకాలువలకు ఇబ్బంది జరిగిన ఎడల అటు కల్వర్టుపై నిర్మించిన కట్టడాలను కూల్చివేయబడునని రాశారు.ఊర చెరువు అనుకొని నిర్మించిన "సంజీవని ప్రాజెక్టు వెంచర్" నిర్వాహకులు ఫీడర్ చానలను సిమెంట్ కాంక్రీట్ తో మూసివేసి దానిపై రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. తద్వారా చెరువులోకి ఫీడర్ ఛానల్ ద్వారా నీళ్ళు రావడమే గగనమైన పరిస్థితి ఉందని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి వెంటనే ఫీడర్ ఛానల్ లపై నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ బెడ్లను ధ్వంసం చేసి నీటిపారుదల సాఫీగా సాగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.శిఖంలో ఉన్న భూమి యాజమానులు ఎండకాలంలో పంటలు పండించుకొని,వాన కాలంలో వదిలేయాలి.పెద్ద చెరువు నుంచి వచ్చే నీటి ప్రవాహం కాలువ దాన్ని కూడా ధ్వంసం చేశారు.ఆర్ అండ్ బి అధికారులు కొత్తూరు నుంచి బాల నగర్ దాకా ఉన్నటువంటి పాత కర్నూల్ రోడ్డును కూడా ఆర్ అండ్ బి శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇరిగేషన్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా భూమి యజమానులు ఎన్వోసీలు ఇవ్వడం జరుగుతోందని,ఊర చెరువు నుండి కాలువల ద్వారా బాలానగర్ మండలంలో ఉన్న మూతి ఘనపూర్ ఆయిల చెరువు,అలాగే బాలనగర్ పెద్ద వాగుకి నీరు చేరుతూ ఉండేవి.నేడు రియల్ ఎస్టేట్ దందాల పేరుతో కాలువలను ఆక్రమించి ఫ్లాట్లుగా మలిచి ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు.బాల నగర్ పెద్దవాగుల్లోకి నీటిపారుదల అటు ఉంచితే,రెండు ఫీడర్ ఛానల్ ద్వారా ఊర చెరువు నిండే పరిస్థితి కనుమరుగు అయింది.

ఇరిగేషన్ శాఖ అధికారులు పలుమార్లు తానే స్వయంగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన పట్టించుకునే పరిస్థితి నేడు కనుమరుగైపోయిందని విచారం వ్యక్తం చేశారు. బక్కని నర్సింహులు,

కాబట్టి ఇరిగేషన్ ఒక అధికారులు ప్రజలకు,ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వతస్తు పలుకుతూ ఎన్‌ఓసీలు జారీచేయడం

గమనార్హం,ప్రజలకు జవాబు దారితనంగా ఉండాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడిన వైనం నేడు కొట్టొచ్చినట్టు కనపడుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. తను పలుమార్లు లిఖిత పూర్వకంగా ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడంతో భవిష్యత్తులో న్యాయస్థానాన్ని (కోర్టును) ఆశ్రయించే పరిస్థితి వచ్చిందని పత్రిక ముఖంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అన్మారి వెంకటయ్య,నేనావత్ గోపాల్ నాయక్ స్థానికులు పాల్గొన్నారు.

# మానసిక సమస్యతో బాధపడుతున్న మహిళ అదృశ్యం



**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. బండ్లగూడకు చెందిన కె. నారాయణ తన భార్య కె.లక్ష్మి (39) కనిపించడం లేదని నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, కె.లక్ష్మి గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో,పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.మహిళ ఎత్తు సుమారు 5 అడుగులు, గోధుమ వర్ణం, సన్నగా ఉంటుంది. గుండ్రటి ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉండగా, అదృశ్యమైన సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు నాగోల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు నాగోల్ పోలీస్ స్టేషన్‌ను లేదా 9676175912ఈ నంబర్‌ను సంప్రదించాలని నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ కోరారు.

# ఉద్యమకారులకు చర్చల పేరుతో కాలయాపన చేయొద్దు

**తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ సమితి**



**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపులో చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయొద్దని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ సమితి నేతలు కోరారు.ఈ మేరకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఐక్య కార్యాచరణ కమిటీ చీఫ్ కన్వీనర్ సుల్తాన్ యాదగిరి, కన్వీనర్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని 12 ప్రధానమైన తెలంగాణ ఉద్యమకారుల కమిటీలతో కలిసి నూతన తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ సమితిని ఏర్పాటు చేశామని వారు తెలిపారు.చీఫ్ కన్వీనర్ గా సుల్తాన్ యాదగిరి, కన్వీనర్ గా తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్ డాక్టర్ పాండుగౌడ్ కో కన్వీనర్లుగా అనిల్ కుమార్, జానకి రెడ్డి, సోమయ్య,పద్మ, తోడేటి శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.నిజమైన ఉద్యమకారులకు మాత్రమే న్యాయం జరగాలని విజ్ఞప్తి చేశారు.250 గజాల స్థలం,25 వేల పెన్షన్ కోటి రూపాయల బీమా,స్మృతి వనం వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పలువురు ఉద్యమకారులు మాధవి, రవీందర్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పట్నం కుటుంబానికి మాజీ మంత్రుల పరామర్శ

**మాతృ వీయోగానికి గురైన పట్నం కుటుంబం**

**మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు,పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి,సత్యవతి రాథోడ్, లక్ష్మారెడ్డి,శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పరమార్శ**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాబాద్ లోని మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి నివాసంలో పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పట్నం మహేందర్ రెడ్డి,పట్నం నరేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డి తో పాటు, కుటుంబ సభ్యులు సునీతా రెడ్డి నీరజా రెడ్డి, స్మృతి రెడ్డి,పుల్ల నర్మదా రెడ్డి తదితరులు లను పలుకరించిన హరీష్ రావు. వారు పట్నం కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.తాను గత వారం నిమ్స్ ఆస్పత్రిలో రుక్కమ్మను పలుకరించగా ఉషారుగా మట్లాడిందని హరీష్ రావు, సవిత ఇంద్రారెడ్డి లు చెప్పారు.రుక్కమ్మ ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్,మహేష్ రెడ్డి,ధర్మ రెడ్డి అలాగే మాజీ ఎంపీ మాలోత్ కవిత,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ జడ్పీ చైర్పర్సన్ బిందు, డి సి సి బి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్ కొలన్ కృష్ణ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మహిపాల్,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# మాలలకు రోస్టర్ వల్ల తీవ్ర అన్యాయం

**ఆగస్టు10న 'హలో మాల-చలో ఢిల్లీ' గోడ పత్రిక ఆవిష్కరన**




**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**రాష్ట్రంలో అమలవుతున్న ఎస్సీ వర్గీకరణ చట్టం,రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆరోపించింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో గౌరవాధ్యక్షుడు చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నరసింహయ్య, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్లతో కలసి జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ హలో మాలచలో ఢిల్లీ' గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విస్మరించి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిందని,14 ఉద్యోగ నోటిఫికేషన్లతో మాల యువత నష్టపోయారని ఆరోపించారు. మాల ప్రజాప్రతినిధులు స్పందించాలని, లేకుంటే వారి ఇళ్ల ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. రోస్టర్ విధానాన్ని నిపుణుల సూచనలతో సవరించాలని డిమాండ్ చేస్తూఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ఆగస్టు10, 11 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల-చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మాల సంఘాలు, విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సఖి గంగాధర్, తుమ్మ శ్రీనివాస్, సీపూరి ప్రణయ్, మాదాసు రాహుల్, పందుగ భానుతేజ, బత్తుల రమేష్, బత్తుల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ కొనసాగించాలి..

**గౌరవ వేతనం, వార్డు సభ్యులకు పారితోషికం కల్పించాలి..**

**రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన ఉప సర్పంచ్‌లు..**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై వస్తున్న ఆరోపణలను ఖండించాలని, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ఉప సర్పంచ్‌లకు కల్పించిన చెక్ పవర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉప సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ ల పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్కయ్య గోవర్ధన్ రెడ్డి, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్, షాద్‌నగర్ జనరల్ సెక్రటరీ జి.అభినవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం ఉప సర్పంచ్‌లు ఎంతో కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించి నెలకు ₹5,000 గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వార్డు సభ్యులకు నెలకు ₹3,000 గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. గ్రామ సర్వసభ్య సమావేశాల్లో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పూర్తి స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను కొనసాగించడం ద్వారా గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని వారు పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్,జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, గౌరవ అధ్యక్షుడు రాలబండి శివకుమార్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్,జిల్లా ఉపాధ్యక్షులు టి.రోహిత్, జి.బాలరాజ్, ఇ.యాదగిరి రెడ్డి, కార్యవర్గ సభ్యులు కె.విజయ్ కుమార్, నందిగామ మండల అధ్యక్షుడు శివశంకర్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు డి.గణేష్, కొత్తూరు మండల అధ్యక్షుడు ఆరోగ్యం, కేశంపేట మండల అధ్యక్షుడు షకీల్, సున్నాల గణేష్, శ్రీనివాసలగూడ గోపాల్ రెడ్డి, సి.ప్రభాకర్,చిర్ర లక్ష్మయ్య, జే.మల్లేష్, యారం రాంరెడ్డి, హేశ్వరం మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మంచాల మండల అధ్యక్షుడు యాదగిరి,కడ్తాల్ మండల అధ్యక్షుడు లక్పతి నాయక్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు,ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఇసుక వాగు బ్రిడ్జి ని పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్



**వాజేడు,జులై 29,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలోని ఇసుక వాగును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.
పరిశీలన అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ఇసుకవాగుకు సంబంధించిన పరిస్థితులు, అవసరమైన చర్యలపై చర్చించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టరుని ఆదేశించారు.

# మేడారం తరహాలో నెల కూలిన చెట్లు

## సహాయ చర్యలు చేపట్టిన నాయకులు పోలీసులు





**వాజేడు,జులై 29,(ప్రజావినికిడి):**మంగపేట మండలం కోమటిపల్లి వెళ్లే దారిలో మంగళవారం సాయంత్రం ఒక్క సారిగా వీచిన బలమైన గాలులకు భారీ వృక్షాలు రోడ్డు పై రోడ్డు పక్కన పడ్డాయి.సంద్రోని ఒర్రె దాటి శాంతి నగర్‌కు వెళ్లే రహదారి సమీపంలోని అటవీ ప్రాంతంలో మహా వృక్షాలు నేలకోరిగాయి.చెట్లు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు అంత రాయం ఏర్పడింది.ఈ లాంటి సంఘటన 2024 ఆగస్టు 31న తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో "టోర్నీడో" వచ్చింది అప్పుడు వచ్చిన గాలులకు అక్కడ చాల చెట్లు నేలకొరిగిన ఘటనను తలపించిందని స్థానికులు అంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు కాంగ్రెస్ నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై పడిపోయిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించే చర్యలు చేపట్టారు.

# మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**వాజేడు,జులై 29, (ప్రజావినికిడి):**
వాజేడు మంగళ వారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచులు,
వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు,ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు,



సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.
అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,ప్రభుత్వ



పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో వైద్యం కొరకు 1,50,000 ఎల్ఓసిని లబ్ధిదారునికి అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ పట్టణంలోని రామ్ నగర్ కాలనీ కి చెందిన ఓరగంటి ముత్యాలు అత్యవసర వైద్య సహాయార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సహాయం కోరక సంప్రదించగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మెరుగైన వైద్య చికిత్స కొరకు తన సిఫారసుతో 1,50,000 ఎల్ఓసిని మంజూరు చేయించారు.ఈ సందర్భంగా లబ్ధిదారునికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయం షాద్ నగర్ కౌన్సిలర్ వాణి పాండురంగారెడ్డి మాజీ కౌన్సిలర్ నందకిషోర్ చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఓరగంటి రవీందర్,ఎల్లయ్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# తమకు నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానా అనే విధంగా హైడ్రా వ్యవహరించింది.

### బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
పేదల పక్షాన బిఆర్ఎస్ చేసిన పోరాటానికి ప్రతిఫలమే ఈ ఫలితం.
సిట్టింగ్ హై కోర్ట్ జడ్జితో హైడ్రా ఆగడాలు, దోపిడీపై పై సత్వర విచారణ చేపట్టాలి.. బిఆర్ఎస్ పార్టీ డిమాండ్..
హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహార తీరుపై రాష్ట్ర హైకోర్ట్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మీడియ ముఖంగా హైడ్రా ద్వారా ప్రభుత్వం సాగించిన దురాక్రమ పాలన,హైడ్రా కమిషనర్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయం,అధర్మం పై ధర్మం సాధించిన విజయం.హై కోర్టు తీర్పు బిఆర్ఎస్ పేదల పక్షాన సాగిస్తున్న పోరాటానికి వచ్చిన ప్రతిఫలం. రేవంత్ రెడ్డి హిట్లర్ పోకడలకు ఈ తీర్పు చెంప పెట్టు.ఏ వ్యవస్థలైన బాబా సాహెబ్ అంబెద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పని చేయాల్సిందే కానీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదని హైడ్రా కమిషనర్ ను తొలగించాలని ఇచ్చిన తీర్పు రుజువు చేసింది.రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ కిందే హైడ్రా పని చేస్తోంది.హై కోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖల మంత్రిగా కొనసాగే నైతిక అర్హతను కోల్పోయారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్టే రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలి.విపత్తుల సమయం లో ప్రజలకు అండగా ఉండాల్సిన హైడ్రా ప్రజలను విపత్తుల్లోకి నెడుతోంది. తమకు నచ్చిన వారికి నజరానా నచ్చని



వారికి జరిమానా అనే విధానాన్ని అమలు చేయడానికి రేవంత్ రెడ్డి హైడ్రా ను దుర్వినియోగం చేస్తున్నారు. హైడ్రా తో ప్రజలకు జరిగిన మేలు గోరంత.. జరిగిన నష్టం కొండంత..హై కోర్టుకు సారీ చెప్పిన రంగనాథ్ తనను తొలగించాలని న్యాయస్థానం ఆదేశం ఇచ్చిన తర్వాత తన చర్యలని సమర్థించుకోవడం ఎంతవరకు సబబు ?న్యాయ వ్యవస్థను గౌరవిస్తారా లేదంటే ఓ వ్యక్తి దుర్మార్గాలను ప్రోత్సహిస్తారా రేవంత్ రెడ్డి తేల్చుకోవాలి.
బుల్డోజర్ రాజ్ వైపా రూల్ బుక్ వైపా అనేది రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలి..రేవంత్ పాలనలో హైడ్రా లాంటి వ్యవస్థ పేద,మధ్యతరగతి వర్గాల పాలిట హైడ్రోజన్ బాంబు లా మారింది.అందుకే మా అధినేత కేసీఆర్ బీ ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చిన వెంటనే హైడ్రా భూతాన్ని తరిమికొడతామని,మొదటి నిర్ణయం ఇదే అవుతుందని జగిత్యాల సభలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.
రంగనాథ్ పోయి ఇంకో రంగయ్య వచ్చినా రేవంత్ హిట్లర్ పోకడలు మానక పోతే హైడ్రా తీరు మారదు..చేసిన దుర్మర్గాలు చాలవన్నట్టు హైడ్రా కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు.బిఆర్ఎస్ నేతల రక్తం తో పొలాలు పండించాలన్న రేవంత్ రెడ్డి హైడ్రా తో ప్రజల రక్త మాంసాలు కండ్ల జూస్తున్నారు.
తనకు హిట్లర్ ఆదర్శమన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్ప ఈ దేశం లో ఎవరైనా ఉన్నారా.?
రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ నీతులు చెబుతారు.రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న రేవంత్ రెడ్డి పై రాహుల్ గాంధీ మౌనం అనేక అనుమానాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్.. రేవంత్ బ్లాక్ మెయిల్ కు రాహుల్ గాంధీ కూడా భాదితుడిగా మారి రాష్ట్రం లో రాక్షస పాలన నడుస్తున్నా దృతరాష్ట్రుడిలా మారిపోయారా.?
రాహుల్ గాంధీ అధికారం లోకి వస్తే జెన్ జీ తరానికి విద్యాశాఖ మంత్రిగా భాద్యతలు అప్పగిస్తామని రేవంత్ చెప్పడం మిలీనియం జోక్...రాహుల్ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి మంత్రులను నియమిస్తాడా ?ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత అన్నట్టు ఉంది రేవంత్ వ్యవహారం. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా రేవంత్ విఫలమయ్యారుజెన్ జీ మీద అంత ప్రేమ ఉంటే తన స్థానం లో 30 యేండ్ల లోపున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ను విద్యా శాఖ మంత్రిగా నియమించొచ్చు కదా..రోజుకో డ్రామా,దినానికో డైవర్షన్ తో రేవంత్ రెడ్డి ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్నారు.ప్రజలకు రేవంత్ మాయ మాటలన్నీ అర్థమై పోయాయి..ఇక మసిపూసి మారేడు కాయ చేస్తానంటే కుదిరే కాలం పోయింది..హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైంది.హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొమ్మిది తలల సర్పమని హై కోర్టు అంటే రేవంత్ రెడ్డి ని పది తలల రావణుడని ప్రజలు అంటున్నారు.రేవంత్ రావణ పాలన పోవడం ఖాయం కేసీఆర్ రాముడి పాలన రావడం ఖాయం.

# కొలన్ తేజ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఆషాడ మాస బోనాల పండుగ..



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోనీ నిజాంపేట్ లో వెలసినటువంటి అతి పురాతనమైన ఆలయం శ్రీ చర్ల ఎల్లమ్మ తల్లి ఆలయం నందు ప్రతి ఏడాది ఆషాడ మాసంలో మూడోవ వారం నిజాంపేట్ గ్రామ ప్రజలందరిచే బోనాల పండుగ నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో భాగంగానే ఈ ఏడాది కూడా ఆలయ ప్రధాన అర్చకురాలు నాగమ్మ చే కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు. శివసత్తులు పోతరాజులు నృత్యాలతో బోనం ఎత్తి మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ చర్ల ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను ఎంతో ఘనంగా ప్రతి యేట నిర్వహించుకుంటామని ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పిస్తామని అన్నారు. ఎల్లమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు . నియోజకవర్గ ప్రజలందరికీ ఆషాడ మాస బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ గ్రామస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు

# భారతీయ జనతా పార్టీ చేపట్టిన 24 గంటల ప్రవాస్ కార్యక్రమం విజయవంతం..

## తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పద్మానగర్ 284 డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు కట్ట కుమార్ ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. బిజెపి చేపట్టిన 24 గంటల ప్రవాస్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి శ్రీధర్ వర్మ డివిజన్ ప్రధాన కార్యదర్శి దొడ్డి కృష్ణయ్య డివిజన్ ఉపాధ్యక్షులు నరసింహ చారి డివిజన్ ఉపాధ్యక్షురాలు సానబోయిన సుజాత బిజెపి డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షులు గాజుల లక్ష్మీ బిజెపి సీనియర్ నాయకులు హీరోలాల్ సిద్ధి



రాములు వసంత్ అంబేద్కర్ నగర్ సునీల్ నాగ శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ నగర్ శ్రీనివాస్ చింటూ అదేవిదంగా బిఎంఎస్, ఆర్ఎస్ఎస్, విహెచ్పి, బజరంగ్దళ్ వివిధ క్షేత్రస్థాయి నాయకులు బిఎల్ ఎ అండ్ బిఎల్ఓ లు బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.
అనంతరం పార్టీ నిర్దేశించిన 7 కార్యక్రమాలను నిర్వహిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలతోసమావేశమయ్యారు.అలాగే బీఎల్ఏలు, బీఎల్‌వోలుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల జాబితా, సంస్థాగత అంశాలపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం స్థానిక మెహర్ సాయి స్కూల్ అలాగే ఆర్ఎస్ కె స్కూల్లో ఉన్న ఎనిమిది బూతుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలా కొనసాగుతుంది అని బిఎల్ఓ అండ్ బిఎల్ఎ లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా బాపూనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ గౌడ్ తో నియోజకవర్గం కు సంబంధించి పలు విషయాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, బీజేపీ కార్యకర్తలు, బీఎల్ఏలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ను ప్రతి ఒక్క బిఎల్ఏ నూటికి నూరు శాతం పూర్తి చేయాలి..

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద్..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 286 – కుత్బుల్లాపూర్ డివిజన్ 516 బూత్ ఎస్ఐఆర్ బిఎల్ఏగా పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమణ రావు 93% ఓటర్ ఎమిరేషన్ ఫామ్ లు పూర్తిచేసి బిఎల్ఓకి అందజేసినారు. ఈ సందర్భంగా బిఎల్ఏ గా 93% ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసిన రమణ రావు కి బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శాలువా కప్పి అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్దిరాములు, సాంబశివారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్,కాలే నగేష్,సమ్మయ్య నేత,అనిల్, బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఆసుపత్రిలో పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి..

## కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,వైద్యులతో చికిత్స వివరాలపై ఆరా..





**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరామర్శించారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స,ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని,ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బోనాల సంప్రదాయాన్ని భావితరాలకు చాటేలా

# చిన్నారుల అద్భుత నృత్య రూపకం..

## కేశంపేట మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి..



**కొరియోగ్రాఫర్ రాజు మాస్టర్ సత్తా నాకు తెలుసు.. జర్నలిస్ట్ కేపీ..**

**షాద్‌నగర్ లో "జోగు చెప్పే జోగులాంబవే" పాట విడుదల..**

**చిన్నారుల వేషధారణ, నృత్య ప్రదర్శనకు విశేష ఆదరణ..**

**సంస్కృతి, సంప్రదాయం, భక్తి భావాలను కళ్లకు కట్టినట్లు చూపించిన రాజు మాస్టర్ బృందం..**









**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం అన్నీ ఒకే వేదికపై దర్శనమిచ్చే అద్భుతమైన ఆధ్యాత్మిక వేడుక బోనాల జాతర అని కేశంపేట మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. ఖాజా పాషా (కేపీ)అన్నారు. ఆషాఢ మాసం ప్రారంభం కాగానే రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడుతాయని,ఇలాంటి గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలంటే నేటి చిన్నారులు కూడా ఈ సంస్కృతి, సంప్రదాయాలను ఎంతో శ్రద్ధగా ప్రదర్శించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఆహా హోమ్ థియేటర్‌లో "జోగు చెప్పే జోగులాంబవే" పాటను కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. ఖాజా పాషా (కేపీ)చేతుల మీదుగా ఘనంగా విడుదల చేశారు. ప్రముఖ సినీ, బుల్లితెర కొరియోగ్రాఫర్ కోనేటి రాజు మాస్టర్ సారథ్యంలో నిర్మించిన ఈ పాటను మాస్టర్ ఎస్‌డీసీ ద్వారా విడుదల చేశారు. పాటకు కొరియోగ్రఫీతో పాటు దర్శకత్వ బాధ్యతలను కోనేటి రాజు మాస్టర్ నిర్వహించారు. ఐదు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులు ఈ పాటలో నటించడం విశేషంగా నిలిచింది.

ముఖ్యంగా బోనాల సంప్రదాయానికి సంబంధించిన అమ్మవారి వేషధారణతో పాటు పోతురాజుల వేషధారణలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులతో సంప్రదాయబద్ధంగా నృత్య రూపకాన్ని రూపొందించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకునేలా రాజు మాస్టర్ అద్భుతంగా తెరకెక్కించారు.

ఈ పాటకు మ్యూజిక్ డైరెక్టర్‌గా శంకర్ వ్యవహరించగా, గౌరీ రాథోడ్ ఆలపించారు. డీఓపీ,ఎడిటింగ్ బాధ్యతలను మోహన్ గుంజి, మేకప్ నందిని నిర్వహించారు. ఆయన అద్భుతమైన చిత్రీకరణ, ఎడిటింగ్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు.

### బోనాల ప్రత్యేకతను భావితరాలకు అందించాలి

ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరాల వరకు మహిళలు తలపై బోనం మోసుకుంటూ అమ్మవారికి నైవేద్యం సమర్పించడం, డప్పుల మోతలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఊరేగింపులు బోనాల జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. భక్తి, సంప్రదాయం, జానపద కళలు కలిసిన ఈ మహోత్సవం తెలంగాణ ప్రత్యేకతకు ప్రతీకగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. బోనాల వంటి గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయడం ద్వారా వాటిని భవిష్యత్ తరాలకు సజీవంగా అందించవచ్చని తెలిపారు.

### రాజు మాస్టర్ ప్రతిభ నాకు బాగా తెలుసు

సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. ఖాజా పాషా (కేపీ) మాట్లాడుతూ, ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ రాజు మాస్టర్ ఎంతోమందికి గొప్ప అవకాశాలు కల్పించారని, ఆయన ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న వారిలో తాను కూడా ఒకరినని అన్నారు.రాజు మాస్టర్ ప్రతిభ ఎంతో గొప్పదని, ఈ ప్రాంతంలో ఐదు సంవత్సరాల చిన్నారుల నుంచి 50 సంవత్సరాల వయసు ఉన్నవారి వరకు ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.ఒక వ్యక్తిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానిని వెలికి తీయడంలో రాజు మాస్టర్ నిష్ణాతుడని కొనియాడారు. రాజు మాస్టర్ అటు సినిమాల్లో, ఇటు బుల్లితెరపై ఎంతోమంది నటీనటులకు కొరియోగ్రఫీ అందించి తన ప్రతిభను చాటుకున్నారని కేపీ తెలిపారు. త్వరలోనే మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులపై ఒక పాటను చిత్రీకరించాలని తాను ఆలోచిస్తున్నానని అందుకు రాజు మాస్టర్ సహకరించాలని కోరారు.అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు కూడా తనవంతు అవకాశాన్ని కల్పిస్తానని, వారితో మరో పాటను తప్పకుండా రూపొందిస్తానని కేపీ తెలిపారు.

### బోనం సంప్రదాయాన్ని భావితరాలకు వివరించాలన్నదే నా తాపత్రయం

డాన్స్ మాస్టర్ కోనేటి రాజు మాట్లాడుతూ, 'బోనం'అనే పదం'భోజనం' నుంచి ఉద్భవించిందని పండితులు చెబుతారని, అందుకే బోనాల చరిత్ర, సంప్రదాయాలను భావితరాలకు ఈ చిన్నారుల నృత్య రూపకం ద్వారా వివరించాలన్నదే తన తాపత్రయమని అన్నారు.ఆషాఢ మాసం సందర్భంగా చిన్నారులను అమ్మవార్లుగా, పోతురాజులుగా తీర్చిదిద్ది బోనాల సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా మంచి పాటను రూపొందించామని తెలిపారు.ఈ పాట ద్వారా బోనాల సంప్రదాయానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కొత్త మట్టి లేదా ఇత్తడి పాత్రలో అన్నం, బెల్లం,పాలు లేదా పెరుగు వండి,పసుపు, కుంకుమతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడాన్ని బోనం అంటారని రాజు మాస్టర్ వివరించారు.ఈ బోనాన్ని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పిస్తే గ్రామదేవత సంతోషించి కుటుంబానికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులు ప్రసాదిస్తుందనే విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. అందుకే బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. బోనాల సంప్రదాయం వల్ల గ్రామాలు పచ్చగా ఉంటాయని, ఎలాంటి చీడపీడలు లేకుండా ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారని, వ్యవసాయ పంటలు సుభిక్షంగా పండుతాయని, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ప్రజల విశ్వాసమని రాజు మాస్టర్ తెలిపారు.ఈ పాట రూపకల్పనకు సహకరించిన చిన్నారుల తల్లిదండ్రులకు, సాంకేతిక బృందానికి రాజు మాస్టర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనను ఎంతో ప్రోత్సహిస్తున్న మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులకు, సీనియర్ జర్నలిస్ట్ కేపీకి, స్థానిక జర్నలిస్టులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ముఖ్య అతిథులకు ఘన సన్మానం

కార్యక్రమం ముగింపు సందర్భంగా "జోగు చెప్పే జోగులాంబవే" పాటలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులతో పాటు ముఖ్య అతిథులను రాజు మాస్టర్ ఘనంగా సన్మానించారు. బోనాల సంప్రదాయం, తెలంగాణ సంస్కృతి, జానపద కళలను చిన్నారుల ద్వారా భావితరాలకు పరిచయం చేసేలా రూపొందించిన ఈ నృత్య రూపకం కార్యక్రమానికి హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రఘు,శివ పెద్దలు పాల్గొన్నారు.

---

# విచ్చలవిడిగా తయారవుతున్న కల్తీ పన్నీర్..

**కీసరలో కల్తీ పన్నీర్ కేంద్రంపై ఎస్ఓటీ అధికారుల దాడులు.. -పన్నీర్ అని తింటే ప్రాణాలు పోతాయేమో.?**

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కేటుగాళ్లు.. -దొరికితే కంటి తుడుపు కేసులు, మళ్లీ అదే దందా..**







**హైదరాబాద్, (ప్రజావినికిడి):** గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు తింటున్న పన్నీర్ నిజంగా పన్నీర్‌నా.? లేక ప్రాణాలు తీసే విషమా.? అనే అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయి..కీసర పరిసరాల్లో నడుస్తున్న కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఎస్ఓటీ అధికారులు నిర్వహించిన దాడుల్లో సుమారు 1000 కిలోల కల్తీ పన్నీర్ స్వాధీనం కావడం తీవ్ర కలకలం రేపింది.ఈ ఘటనతో నగరంలో ఆహార భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కెమికల్స్‌తో పన్నీర్ తయారీ, ప్రజల ఆరోగ్యంతో ఆటలు

అక్రమ సంపాదన కోసం కొందరు కేటుగాళ్లు నాసిరకం పదార్థాలు, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించి కల్తీ పన్నీర్ తయారు. చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ పన్నీర్ నగరంలోని హోటళ్లు,టిఫిన్ సెంటర్లకు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం,ఈ విషయం తెలిసి ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమవుతుందనే కనీస బాధ్యత లేకుండా డబ్బే లక్ష్యంగా ఈ మాఫియా వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### దాడులు జర్నలిస్టుల సమాచారంతోనేనా.?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనేక ప్రాంతంలో జరుగుతున్న ఈ అక్రమ దందాపై స్థానిక జర్నలిస్టులు అందించిన సమాచారంతోనే ఎస్ఓటీ పోలీసులు దాడులకు సిద్ధమయ్యారనే చర్చ సాగుతోంది. ప్రశ్న ఏమిటంటే... ఇంత పెద్ద ఎత్తున అక్రమ తయారీ జరుగుతున్నా ఫుడ్ ఇన్స్పెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు, స్థానిక పోలీసు యంత్రాంగానికి ఎందుకు కనిపించలేదు.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### స్థానిక పోలీసుల కనుసైగల్లోనే అక్రమ వ్యాపారాలా.?

కల్తీ ఆహార పదార్థాల నియోగంపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు మరింత తీవ్రమవుతుంటే మొక్కుబడిగా దాడులు చేస్తున్నారు. కొన్ని అక్రమ వ్యాపారాలు స్థానిక పోలీసుల కనుసైగల్లోనే సాగుతున్నాయనే విమర్శలు ప్రజల నుండి తీవ్రంగా వినిపిస్తున్నాయి. దాడులు జరిగిన తర్వాత కేసులు నమోదు చేసి కంటి తుడుపు చర్యలతో చేతులు దులుపుకోవడం తప్ప అక్రమ దందాలకు శాశ్వత అడ్డుకట్ట వేయడంలో అన్ని శాఖల అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దానితో తిరిగి అక్రమార్కులు అదే అక్రమ వ్యాపారమును యదేచ్ఛగా నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారు.

### ముఖ్యమంత్రి హెచ్చరికలు చేసిన అధికారుల్లో చలనం ఎక్కడ.?

ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఫుడ్ సేఫ్టీ,పోలీసు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో కల్తీ మాఫియా మరింత రెచ్చిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దానితోపాటు కొంతమంది అధికారులు సిబ్బంది ఆహార కల్తీ మాఫియా నాయకులకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### వాహనాల సీజ్‌తోనే దందాకు చెక్

కల్తీ పన్నీర్,రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న ఆటోలు,ఇతర వాహనాలను కనీసం ఒక సంవత్సరం పాటు సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కేసులు నమోదు చేయడం వల్ల ప్రయోజనం లేదని,అక్రమ సంపాదనకు ఉపయోగపడుతున్న వాహనాలను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకొని సంవత్సరం పాటు సీజ్ చేస్తేనే మాఫియాకు గట్టి దెబ్బ తగులుతుందని కానీ కొంతమంది అధికారులు నెలలోపే అక్రమ మార్గంలో పోలీస్ స్టేషన్లో ఉన్న సీజ్ అయిన వాహనాలను వదిలి వేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అత్యంత కఠిన చర్యలతోనే ప్రజల ప్రాణాలకు రక్షణ

కల్తీ ఆహార పదార్థాలు అమ్మే వారిని సాధారణ నేరస్తులుగా కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే (హంతకులులుగా)నేరగాళ్లుగా పరిగణించి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపిని, కమిషనర్లను ప్రజలు కోరుతున్నారు. ఎస్ఓటీ దాడులతో బయటపడిన ఈ వ్యవహారం ఒక్క కేంద్రానికే పరిమితం కాకుండా గ్రేటర్ హైదరాబాద్ నగరమంతటా విస్తరించి ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కల్తీ పన్నీర్ మాఫియాను పూర్తిగా నిర్మూలించి తమ ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# షాద్ నగర్ లో మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు విగ్రహావిష్కరణ

**విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ -క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ ను సన్మానించిన బ్రాహ్మణ పెద్దలు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విగ్రహాన్ని షాద్ నగర్ పట్టణంలో ఏర్పాటు చేయించడం పట్ల బ్రాహ్మణ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సమాఖ్య ప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బూర్గుల రామకృష్ణారావు తెలంగాణ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న మహానేత అని,ఆయన సేవలను భావితరాలకు చాటిచెప్పేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాజకీయ చరిత్రలో బూర్గుల రామకృష్ణారావు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజా సంక్షేమం, పరిపాలనా సంస్కరణలు, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, బ్రాహ్మణ సంఘ సభ్యులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు రిటైర్డ్ ఎమ్మార్వో రామారావు నియోజకవర్గం బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వెంకటేశ్వరరావు బ్రాహ్మణ సమాఖ్య టౌన్ అధ్యక్షుడు బావిలాల సుజీవన్ జిల్లా కార్యదర్శి రవి శర్మ మరియు రాజగోపాల్,నెమలి శ్రీకాంత్రావు, వేణుగోపాల్, మణి సందీప్,సునీల్,ఫణి శర్మ,పూర్ణచంద్రరావు, సుదర్శన్ రావు,సుబ్రహ్మణ్యం, సంజయ్,భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పర్వతాపూర్ లో గ్రామ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై గ్రామంలో ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శ్రీరాములు హాజరై గ్రామ అభివృద్ధి,నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,రాబోయే తరాల కోసం నీటిని ఆదా చేయడం,ప్రకృతిని కాపాడటం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామస్థులు,రైతులు కలిసి పనిచేస్తేనే పర్యావరణ గ్రామం లక్ష్యం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.వర్షపు నీటి సంరక్షణ చెరువులు,కుంటలు,కాలువల పూడిక తొలగించి పునరుద్ధరణ,భూగర్భ జలాల పెంపునకు చర్యలు,ప్రతి ఇంటి వద్ద నీటి వృథాను నివారించడం,మొక్కలు నాటి పచ్చదనాన్నిపెంపొందించడం,గ్రామపరిశుభ్రతమెరుగుపరచడం,నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంవంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,రైతులు,వివిధ శాఖల అధికారులు పాల్గొని నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

## షాద్ నగర్ పురపాలక సంఘంలో (ఎస్ఐఆర్) పై సమీక్ష సమావేశం..

**అన్ని రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్.**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం(స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్)కార్యక్రమం నిర్వహణపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ సునీత రెడ్డి మాట్లాడుతూ,భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు.సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు,సూచనలు తెలియజేయగా,వాటిని పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.అన్ని రాజకీయ పార్టీల సహకారంతో (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఎల్ నినో ఉపద్రవాన్ని అధిగమించడం ఓ సవాల్

**: సీఎం చంద్రబాబు**
**ఎల్ నినోపై అవగాహనకు మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని నిర్దేశం**



**అమరావతి, జూలై 28 జర్నలిస్టు జర్నీ న్యూస్:** రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందన్న అంచనాల నేపథ్యంలో, ఈ ఉపద్రవాన్ని అధిగమించడం అధికార యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కష్టకాలంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని, వారికి సరైన సమాచారం అందిస్తూ నష్టపోకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎల్ నినో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ చర్యలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం మొత్తం ఒక సవాల్‌గా స్వీకరించి సమష్టిగా పనిచేయాలి. మంత్రి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. వరదలు, తుపానుల సమయంలో ఎలాగైతే అప్రమత్తంగా ఉంటామో, అదే రీతిలో ఇప్పుడు కూడా పనిచేయాలి“ అని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీలు, నీటి సంఘాల సభ్యులను ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు, పంటల అధ్యయనం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్ఎస్కే) స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కన్వీనర్లుగా నియమించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో డెయిరీ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభిస్తుందని సీఎం సూచించారు.

**ప్రతి పంటకు బీమా.. కలెక్టర్లదే బాధ్యత**

రైతులను ఆదుకునేందుకు పంటల బీమా కీలకమని చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద నమోదు ప్రక్రియ జూలై 31తో ముగియనుండగా, వరికి ఆగస్టు 15 వరకు గడువు ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 6.30 లక్షల హెక్టార్లలో పంటలు బీమా పరిధిలోకి వచ్చాయని వివరించారు.
దీనిపై సీఎం స్పందిస్తూ.. “రాష్ట్రంలో సాగైన ప్రతి పంటకు కచ్చితంగా బీమా చేయించాలి. ఒక్క పంట నమోదు కాకపోయినా దానికి సంబంధిత జిల్లా కలెక్టర్లే పూర్తి బాధ్యత వహించాలి“ అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్**

ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. “ఈ కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చే డేటాను నిరంతరం విశ్లేషించాలి. ఆ విశ్లేషణల ఆధారంగా రైతులకు అవసరమైన సూచనలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలి. ఏ ల్యాండ్ పార్శిల్‌లో పంటకు ఇబ్బంది ఉంది, అక్కడ బోరుబావి అందుబాటులో ఉందా, భూగర్భ జలాల పరిస్థితి ఏంటి అనే వివరాలతో రైతులకు సరైన మార్గనిర్దేశం చేయాలి“ అని సీఎం అన్నారు. దీనివల్ల రైతులు అనవసరంగా పెట్టుబడి పెట్టి నష్టపోకుండా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు.

**క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన.. ప్రత్యామ్నాయ పంటలు**

ఆగస్టు 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినోపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన కంది, ఆముదం, మినుము వంటి వాటిపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.
ఎల్ నినో కారణంగా నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మొబైల్ వాహనాలను రైతులు లేదా డ్వాక్రా మహిళలకు అప్పగించాలని సీఎం తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో భారీవర్షం

**హైదరాబాద్‌జూలై 28 ((ప్రజావినికిడి):**




హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది.
రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడా, ఉప్పరపల్లి, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్‌గూడా టీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.
కేపీహెచ్‌బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది.
దిల్‌సుఖ్నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్‌పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచనలు చేశారు.

# రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం**

**ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి**

**నిర్దేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి**

**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



**హైదరాబాద్,జూలై 28 (ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మిక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చేందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# హైడ్రా దూకుడుకు హైకోర్టు కళ్లెం !

**హైదరాబాద్ జూలై 28(ప్రజావినికిడి):**
హైడ్రా తీరు, కమిషనర్ రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. దీనిపై సమీక్షించుకోవడం, ఆత్మవిమర్శ చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యంగా భావించాలి. పెద్దలను వదిలి పేదల ఇళ్లను కూలస్తున్నారన్న అపప్రథ రాగానే చర్యలు తీసుకుని ఉంటే ఇంతటి అపప్రథ వచ్చేది కాదు. కానీ సిఎం రేవంత్ పదేపదే హైడ్రాను సమర్థిస్తూ వచ్చారు. అయితే హైడ్రా వల్ల మంచి పనులు జరగలేదని చెప్పడానికి లేదు. ప్రభుత్వ భూముల కబ్జా, చెరువుల కబ్జాను తొలగించడం వంటి చర్యలను ప్రజలు సమర్థి÷-తూ వస్తూనే ఉన్నారు. కానీ పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడాన్ని ఎవరూ సమర్థించరు. పేదలకు గూడు కట్టివాలనుకున్నప్పుడు వారు ఉన్న ప్రాంతాలను వారికే అప్పగించాలి. కానీ వారిని గూడులేని వారుగా చేయడం సరికాదు. హైదరాబాద్‌లోని జలవనరుల రక్షణ, అక్రమార్కుల కబ్జాలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణ పేరుతో ప్రభుత్వం గతేడాది జూలైలో జీవో 99 ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్-హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కాలంలో పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనడంలో సందేహం లేదు. అయితే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు చెడ్డపేరు తెచ్చి పెట్టాయి. చట్టప్రకారం, నిబంధనల మేరకు నడుచుకుని ఉంటే ఇంతగా హైకోర్టు చేత చివాట్లు తినాల్సిన పని వచ్చేది కాదు. హైడ్రా చేస్తున్న పనులపై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణ సందర్భంగా హైకోర్ట్ వరుసగా మొట్టికాయలు వేస్తూనే ఉన్నది. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు చెప్పడం ప్రభుత్వాని చెంపపెట్టుగానే భావించాలి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారం ముందు నుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. బుల్డోజర్లను ఉపయోగిస్తూ ప్రభుత్వం సాగిస్తున్న కూల్చివేతల విషయంలో ఆయన తీరు పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకుతున్నది. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడపట్ల విపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగనాథ్‌పై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఆఫీస్ కోర్ట్ ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు ముందు కూడా రంగనాథ్ తీరు పట్ల హైకోర్ట్ పలుమార్లు మొట్టికాయలు వేసింది. ఇటీవలే ఆయన అరెస్ట్‌కు సైతం ఆదేశాలు ఇచ్చి, న్యాయవాదుల విజ్ఞప్తితో విరమించుకున్నది. హైడ్రా అరాచకాలు, రంగనాథ్ ఉల్లంఘనలపై హైకోర్ట్ చాలాసార్లు ఘాటుగానే స్పందించింది. హైడ్రా చర్యలు యుద్ధ పరిస్థితిని తలపించే చర్యలు అని అభివర్ణించింది. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నమోదు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైడ్రా చర్యలు సరైన దిశలో లేవని న్యాయమూర్తి స్పష్టంచేశారు. 2025 ఫిబ్రవరిలోనూ జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరింత తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముత్తంగి గ్రామంలో ఓ షెడ్‌ను హైడ్రా కూల్చివేసిన తీరును దొంగలముఠా చర్యగా పోల్చింది. రాత్రిపూట రహస్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయని, చట్టపరమైన పక్రియను పాటించకపోతే హైడ్రాను మూసివేయాల్సి




ఉంటుందని హెచ్చరించింది. ముందస్తు సమాచారం లేకుండా సెలవు రోజుల్లో ఎందుకు కూల్చివేతలకు పాల్పడుతున్నారని నిలదీసింది. హైడ్రా తీరుపై హైకోర్ట్ పదేపదే మొట్టికాయలు వేస్తున్నా, అధికారుల తీరును తప్పుబడుతున్నా ఆ సంస్థ యథేచ్ఛగానే వ్యవహరిస్తున్నది. దీనిపై ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోక పోవడంతో హైకోర్టు ముందు దోషిగా న ఇలబడాల్సి వచ్చింది. లోతుకుంటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల పర్వం పరాకాష్టగా చూడాలి. ఏవీ రంగనాథ్‌పై శాంత శ్రీరామ్ కన్‌స్టక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడో ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా జూలై 21న కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది .
కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల విస్తీర్ణంలో కూల్చి వేసిన నిర్మాణాలను హైడ్రానే పునరుద్ధరించాలని జూన్‌లో హైకోర్ట్ తేల్చిచెప్పింది. హైడ్రా దుస్సాహసాన్ని న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తున్నదని జస్టిస్ నాగేశ్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నాయని చెప్పినప్పటికీ రాత్రంతా కూల్చివేతలు జరుపడమేంటని నిలదీసింది. నిర్మాణాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చును అధికారుల వ్యక్తిగత నిధుల నుంచి భరించాలని తేల్చిచెప్పింది. ఇది అరుదైన తీర్పు అని చెప్పవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ వృద్ధుడికి చెందిన వ్యవసాయ భూమిలో చేసిన విధ్వంసాన్ని కూడా జస్టిస్ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. రంగనాథ్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. అడ్వకేట్ జనరల్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడంతో ఆ ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నది. రంగనాథ్ స్వయంగా కోర్టుకు హాజరు కావాలని తేల్చిచెప్పింది. అదే రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు హైకోర్టులో విచారణకు రంగనాథ్ హాజరయ్యారు. అయితే ఆ తర్వాత కూడా హైడ్రా వ్యవహరించే తీరులో మార్పు రాలేదు. హైడ్రా చీఫ్ తానే ఒక చట్టంలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అయితే, అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి మేరకు సైనిక సిబ్బంది మోహరింపు ఉత్తర్వులను కూడా హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. జలవనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అంటూ హైడ్రా చెప్పుకొంటున్నది. కానీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. హైడ్రా అంటే ఉదయం 4 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేసే సంస్థ అని పేరుమోసింది. కోర్ట్ ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ధిక్కరణ ధోరణితో ప్రవర్తిస్తూ, ఆ ప్రవర్తననే విజయంగా ప్రచారం చేసుకొనే బృందంగా గుర్తింపు పొందింది. హైకోర్ట్‌లో 700కు పైగా కేసులు ఎదుర్కొంటున్న హైడ్రా, వివిధ కేసుల్లో విచారణల సందర్భంగా ధర్మాసనాలతో మొట్టికాయలు వేయించుకుంది. హైడ్రా రాజకీయంగా తటస్థంగా వ్యవహరించడంలేదని ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికార పార్టీకి చెందిన నేతల అక్రమ కట్టడాలను హైడ్రా ఎందుకు కూల్చివేయడంలేదని విపక్షనేతలు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, గడువు అడిగితే నిరాకరించడం, అప్పీల్‌కు అవకాశం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ప్రభుత్వ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టడం దారుణం. ఇప్పటికైనా హైడ్రా తీరు మారాలి. చట్టబద్ధంగా, నిబంధనల మేరకు నడుచుకుంటే మంచిది. పేదల పక్షాలన నిలబడాల్సిన అసవరం కూడా గుర్తించాలి.

# భోగాపురం ఎయిర్ పోర్టుతో
# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

**ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా ఏఎస్ఆర్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం**

**2,703 ఎకరాల విస్తీర్ణం, రూ.4,727 కోట్ల ప్రాజెక్టు.**

**3,800 మీటర్ల రన్‌వేతొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం**

**500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ**

**ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం**



**అమరావతి, జూలై 28 (ప్రజావినికిడి):** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో మైలురాయి ఆవిష్కృతం కానుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెల నుంచి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఆగస్టు ఒకటో తేదీన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం వస్తున్నారు.
విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ కీలకం కావడంతో ఈ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి కూటమి సర్కార్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన నగరాల సరసన చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో అదే స్థాయి ప్రమాణాలతో భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధమైంది. కేవలం విమాన ప్రయాణ కేంద్రంగానే కాకుండా.. పరిశ్రమలు, ఉపాధి, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు కేంద్రబిందువుగా మారేలా అల్లూరి సీతారామ రాజు ఎయిర్ పోర్టుకు రూపకల్పన చేశారు. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భోగాపురం ఒకటి. నిర్మాణం ప్రారంభమైన కేవలం 31 నెలల్లోనే పనులు పూర్తి చేయడమే కాకుండా, మొదట నిర్ణయించిన గడువుకంటే దాదాపు ఐదు నెలల ముందే సిద్ధం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం?విజయనగరం?శ్రీకాకుళం జిల్లాల ఆర్థికాభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు, పారిశ్రామిక పెట్టుబడులకు, ఎగుమతులకు, లాజిస్టిక్స్‌కు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక మౌలిక వసతిగా మారనుంది.
జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ద్వారా పీపీపీ విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. మొత్తం 2,703.26 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. విమానాశ్రయం 2,203 ఎకరాలు, ఏవియేషన్ హబ్ 500 ఎకరాలు, ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీ 136 ఎకరాలు కేటాయించారు. విమానాశ్రయ పరిధిలో ఎయిర్‌సైడ్ డెవలప్‌మెంట్, సిటీ సైడ్ కమర్షియల్ డెవలప్‌మెంట్, రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారు. 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఈ విమానాశ్రయానికి ప్రధాన ఆకర్షణ. వైడ్‌బాడీ విమానాల కార్యకలాపాలకు అనుకూలంగా దీనిని రూపొందించారు. అంటే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్ లైనర్, ఎయిర్ బస్ ఎ330, ఎయిర్ బస్ ఎ340 వంటి భారీ ఎయిర్ క్రాఫ్టులు భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి రాకపోకలు సాగించగలవు. ఇక ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్, నావిగేషన్ ఎయిడ్స్, వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు ఈ ఎయిర్ పోర్టులో అందుబాటులో ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రమాణాలతో ఎయిర్‌సైడ్ మౌలిక వసతులను అభివృద్ధి చేశారు.
భోగాపురం విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాడ్యులర్ విధానంలో అభివృద్ధి చేశారు. తొలి దశలో ఏటా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఉంటుంది. భవిష్యత్‌లో దశలవారీ విస్తరణ ద్వారా ఈ సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణించేలా విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రయాణికుల రద్దీ పెరిగే కొద్దీ టెర్మినల్, ఎయిర్‌సైడ్, కమర్షియల్ మౌలిక వసతులను విస్తరించేందుకు వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం, వేగవంతమైన ప్రాసెసింగ్, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచేందుకు కాంటాక్ట్ బోర్డింగ్ బ్రిడ్జిలు, కామన్ యూజ్ పాసింజర్ ప్రాసెసింగ్ వ్యవస్థ, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్, సెల్ఫ్ సర్వీస్ పాసింజర్ ప్రాసెసింగ్, స్మార్ట్ సర్వైవలెన్స్, యాక్సెస్



కంట్రోల్, సెక్యూర్టీ మేనేజ్మెంట్ సిస్టం, ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ వంటి ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర ఎగుమతులు, పారిశ్రామిక అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం కీలకంగా మారనుంది. ఇక్కడ ఏటా 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రత్యేకించి కార్గో టెర్మినల్ అభివృద్ధి చేశారు. ఫార్మా, మెరైన్ ప్రొడక్ట్స్, అధిక విలువైన, పెరిషయబుల్ ఉత్పత్తుల రవాణాకు అవసరమైన టెంపరేచర్ కంట్రోల్డ్ కోల్డ్ చైన్ సదుపాయాలు కల్పించారు. దీంతో ఉత్తరాంధ్ర నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు వేగవంతం కానున్నాయి. భవిష్యత్‌లో విశాఖపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లతో అనుసంధానం ద్వారా భోగాపురం తూర్పు తీరంలో కీలకమైన ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ హబ్‌గా ఎదగనుంది.
భోగాపురం విమానాశ్రయం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా అభివృద్ధి చేశారు. దీంట్లో భాగంగా 5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఊఎంఅ వ్యవస్థ, ఎల్‌ఈడీ ఎయిర్ పోర్టు లైటింగ్, స్మార్ట్ బిల్డింగ్ మేనేజ్మెంట్ సిస్టం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, వాటర్ రీ-సైక్లింగ్, మురుగు నీటి శుద్ధి చేసే ప్లాంట్లు, ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి వ్యవస్థలతో పర్యావరణ హిత విమానాశ్రయాన్ని ఏర్పాటు అయింది. విమానాశ్రయ నీటి అవసరాల్లో సుమారు 30 శాతం రీసైకిల్ చేసిన నీటితో తీర్చేలా ప్రణాళిక రూపొందించారు.

# కీలక బిల్లలుపై ఎన్‌డిఎ ఎంపిలతో మోడీ చర్చ

## పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం

## ఎన్‌డిఎ పక్ష ఎంపిలతో మంగళ్ మిలన్ భేటీ

**న్యూఢిల్లీ, జూలై 28(ప్రజావినికిడి):**



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు-2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

# నేను పారిపోలేదు.. ఊళ్లోనే ఉన్నా

## : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్ జూలై 28 (ప్రజావినికిడి):**



హైదరాబాద్ జాతీయ పోలీస్ అకాడమీలో సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తాను ఎక్కడికీ పారిపోలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తన సొంత ఊరు ఊళ్లపాలెంలోనే ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, పోలీసుల విచారణకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. తన నాన్నమ్మకు ఆరోగ్యం బాగోలేకపోవడంతోనే సొంతూరుకు వచ్చినట్లు వివరించారు. పోలీసులు వెతికినవి తన తాత్కాలిక చిరునామాలు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఎక్కువగా మాట్లాడలేనని అన్నారు. త్వరలోనే విచారణ అధికారులను కలిసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న తనను ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించారంటూ ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదుతో కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సీనియర్ సినీ నటి పావలా శ్యామల కన్నుమూత





ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.
దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు.
ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

# రామ్ చరణ్ కి సర్జరీ సక్సెస్..

## వైద్య బృందంతో ఆకట్టుకుంటున్న స్పెషల్ ఫోటో!



ప్రముఖ డైరెక్టర్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ ఇటీవల నటించిన రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీ పెద్ది. బాలీవుడ్ బ్యూటీ జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రూ.400 కోట్ల క్లబ్లో చేరి సంచలన విజయం అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన చేతి మణికట్టు వద్ద గాయమైంది. అయితే ఆ గాయం కారణంగా సినిమా షూటింగ్ నిలిపివేయకుండా ప్రమోషన్స్ లో కూడా పాల్గొని సినిమా పట్ల తనకున్న నిబద్ధతను నిరూపించుకున్నారు. ప్రస్తుతం విరామం దొరకడంతో తన భార్య ఉపాసన , తల్లిదండ్రులు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెలతో కలిసి కోయంబత్తూర్ కి బయలుదేరిన రామ్ చరణ్ గంగా హాస్పిటల్ లో ప్రముఖ వైద్య బృందం సమక్షంలో సర్జరీ చేయించుకున్నారు. కొత్తసినిమాలు ఈ మేరకు సర్జరీ విజయవంతం అయింది. ఈ విషయాన్ని పెద్ది మూవీ మేకర్స్ అధికారికంగా దిగ్గజ వైద్య నిపుణులతో రామ్ చరణ్ కలిసి దిగిన ఫోటోని ప్రత్యేకంగా పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "పెద్ది సినిమా షూటింగ్ సమయంలో రాంచరణ్ గాయపడినప్పటికీ నొప్పిని భరిస్తూ కీలకమైన సన్నివేశాల షూటింగ్ ను పూర్తి చేశారు. ఆయన వృత్తిపట్ల చూపిన అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకం" అని వృద్ధి సినిమాస్ కూడా పేర్కొంది. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని చిత్ర బృందం ఆకాంక్షించింది. ఈ మేరకు పంచుకున్న ఫోటోలో రామ్ చరణ్ తో పాటు చేతి మణికట్టు వైద్య నిపుణులు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్ రాజశేఖరన్, అంతర్జాతీయంగా పేరుపొందిన యూఎస్ మియామీకి చెందిన మణికట్టు స్పెషలిస్ట్ డాక్టర్ అలెంజాడ్రో బాడియా, డాక్టర్ ప్రవీణ్ భరద్వాజ్ లు.. సర్జరీ అనంతరం బెడ్ పై ఉన్న రామ్ చరణ్ తో కలిసి దిగిన ఫోటో ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. నిపుణుల సమక్షంలో ఆయనకు సర్జరీ దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ.. వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇటు రాంచరణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిసున్నారు.

# స్టన్నింగ్ మేకోవర్ : అగ్గి రాజేసిన రాశీ ఖన్నా లేటెస్ట్ ఫోటోషూట్




టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనదైన నటన - గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రాశీ ఖన్నా. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల భామ... తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా రాశీ తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన బ్లాక్ అండ్ బోల్డ్ లుక్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా ఒలికించిన సొగసులు అభిమానులను, నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రత్యేకమైన ఫొటోషూట్ కోసం ఈ దిల్లీ బ్యూటీ ధరించిన అవుట్‌ఫిట్... మేకప్ తన అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఫర్ యువర్ రిఫరెన్స్! అనే క్యాప్షన్‌తో పాటు తన స్టైలిస్ట్ శీఫా జే గిలానీ, మేకప్, హెయిర్ అండ్ ఫొటోగ్రఫీ టీమ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ -టేక్స్ ఏ విలేజ్-అని పోస్ట్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో రాజసం ఉట్టిపడేలా రాశీ ఇచ్చిన ఫోజులు, స్టైలింగ్ న భూతో నభవిష్యతి అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందాల రాశీఖన్నా అభిమానులు, నెటిజన్లు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో రీ-పోస్ట్‌లు చేస్తున్నారు. -నలుపు రంగు ఇంత అందంగా ఎప్పుడూ లేదు-, -బాలీవుడ్, టాలీవుడ్‌లలో ఒక కొత్త సంచలనం-,-10 అవుట్ ఆఫ్ 10- అంటూ నెటిజన్లు కామెంట్ల సెక్షన్‌లో హార్ట్, ఫైర్ ఎమోజీలతో రాశీ గ్లామర్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గత కొన్ని రోజులుగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన యాక్టింగ్ స్కిల్స్‌తో మెప్పిస్తున్న రాశీ ఖన్నా, ఇలాంటి ఫ్యాషన్ షూట్స్‌తో తన గ్లామర్ కోణాన్ని కూడా ఆవిష్కరిస్తోంది. ట్రెండ్‌కు తగ్గట్లుగా పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో కనిపిస్తూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా యువతలోఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ ఈ ఫొటోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.

# 'అబ్జెక్షన్ మై లార్డ్'ను చిరంజీవి మెచ్చుకున్నారు... చాలా హ్యాపీ!: శ్రీకాంత్



"మా 'అబ్జెక్షన్ మై లార్డ్' సిరీస్‌ను చూసి మెగాస్టార్ చిరంజీవిగారు చాలా బాగుందని మెచ్చుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని ప్రముఖ నటుడు శ్రీకాంత్ అన్నారు. జీ5 ఓటీటీ వేదికగా రానున్న ఈ ఒరిజినల్ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పంచుకున్నారు. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రిషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ సిరీస్‌కు 'నోటరీ పరశురాం' అనేది ట్యాగ్‌లైన్. 7 ఎపిసోడ్ల ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ జూలై 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించగా, సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "జీ5తో నాకు మంచి అనుబంధం ఉంది. వారితో ఇది నా మూడో వెబ్ సిరీస్. సినిమాల కన్నా సిరీస్‌లకు ఎక్కువ కష్టపడాలి, కానీ చాలా ఎంజాయ్ చేస్తూ పనిచేశాను. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. దర్శకుడు సంతోష్ చాలా క్లారిటీతో ఈ సిరీస్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. నిర్మాత రాజ్ కుమార్ ఎక్కడా రాజీ పడకుండా సపోర్ట్ చేశారు. సిరీస్ అవుట్‌పుట్ చూశాక మేమంతా ఫిదా అయ్యాం. ముఖేష్ రిషి గారు కేవలం నటుడే కాదు, స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి. ఈ సిరీస్ కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. చిరంజీవి గారు కూడా చూసి బాగుందని చెప్పడంతో మా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కినట్లయింది" అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. నటుడు ముఖేష్ రిషి మాట్లాడుతూ, "ఈ సిరీస్ కోసం శ్రీకాంత్ గారు రోజుకు 18 గంటలు పనిచేశారు. ఆయన డెడికేషన్ అమోఘం. జూలై 31న కుటుంబంతో కలిసి ఈ సిరీస్‌ను చూడండి" అని కోరారు. మరో నటుడు సమీర్ మాట్లాడుతూ, "ఇది వెబ్ సిరీస్ కాదు, ఒక వెబ్ ఫిలిం. శ్రీకాంత్ లాంటి ప్రొడ్యూసర్స్ హీరో లేకపోతే ఇది పూర్తయ్యేది కాదు. ఆయన ఒక డైరెక్టర్స్ యాక్టర్. జూలై 31న ప్రేక్షకులు ఒక విజువల్ ఫీస్ట్ చూడబోతున్నారు" అని అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ, "ఈ సిరీస్ షూటింగ్‌ను కేవలం 19 రోజుల్లో పూర్తి చేశాం. శ్రీకాంత్ గారు, ముఖేష్ రిషి గారు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్లే ఇది సాధ్యమైంది. నిర్మాత రాజ్ కుమార్, జీ5 టీమ్ ఇచ్చిన స్వేచ్ఛతోనే ఇంత వేగంగా, నాణ్యంగా సిరీస్‌ను పూర్తి చేయగలిగాం" అని తెలిపారు.

# ఓటీటీలోకి వస్తున్న సత్యదేవ్ 'రావు బహదూర్'..




టాలీవుడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ కుమార్ డి దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ సోషల్ డ్రామా 'రావు బహదూర్' డిజిటల్ విడుదల తేదీ ఖరారైంది. సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది.
థియేటర్లలో విడుదలైన సమయంలో ఈ సినిమా వైవిధ్యమైన కథాంశం, సత్యదేవ్ బలమైన నటన, సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందనను సొంతం చేసుకుంది. సత్యదేవ్ ప్రదర్శించిన నటన, దర్శకుడు మలిచిన ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఓటీటీలోకి వస్తుండటంతో ఈ సినిమా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కోబోతోంది.



# 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్.. స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.
మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




# అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమైన అల్లు అర్జున్.. ఫ్యాన్స్ కు కీలక సూచన!

నెట్టింట సాగే దుష్ప్రచారాలకు దూరంగా ఉండాలని అభిమానులకు బన్నీ హితవు
పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హైదరాబాద్‌లో తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్'ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బన్నీ... సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై పరోక్షంగా స్పందించారు. నెట్టింట సాగే దుష్ప్రచారాలను, వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని అభిమానులకు హితవు పలికారు. సానుకూల ధోరణితో ముందుకెళుతూ, తమ సమయాన్ని, శక్తిని మంచి కార్యాలకే వినియోగించాలని పిలుపునిచ్చారు. అభిమానులు చూపుతున్న అమితమైన ఆప్యాయతకు బన్నీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి గ్రూప్ ఫొటోలు దిగుతూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. నెగెటివిటీకి దూరంగా ఉండాలని అల్లు అర్జున్ ఇచ్చిన సందేశానికి సోషల్ మీడియాలోనూ ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సమావేశంతో అభిమానులకు, ఐకాన్ స్టార్‌కు మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613